12-10-2021 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

"మధురమైన పిల్లలూ -మహావీరులుగా అవ్వండి. మాయా తుఫాన్లతో యుద్ధము చేసేందుకు బదులు అచల్ - అడోల్‌గా(స్థిరంగా) అవ్వండి."

ప్రశ్న :- బ్రహ్మాబాబా ఎదురుగా అనేక గొడవలు జరుగుతున్నా ఎప్పుడూ వ్యాకులపడలేదు, చింతించలేదు, ఎందుకు?

జవాబు :- ఎందుకంటే తండ్రి నుండి వారసత్వం తీసుకోవాలని బాబాకు నషా ఉండేది. ఇది కల్పక్రితము వలె జరుగుతూ ఉంది. కొత్తదేమీ లేదు. అందరికంటే ఎక్కువగా బాబానే నిందలపాలయ్యారు. శ్రీకృష్ణుని కూడా నిందించారు. మరి మనము నిందలపాలవ్వడం పెద్ద విషయమా! ప్రపంచంలోని వారికి మన విషయాలు తెలియవు కనుక తప్పకుండా నిందిస్తారు. అందువలన బ్రహ్మాబాబా ఏ విషయంలోనూ చింతించలేదు, కోప్పడలేదు. అదే విధంగా తండ్రిని అనుసరించండి.

పాట :- భోలానాథునికి సాటియైన వారు.... (భోలానాథ్ సే నిరాలా...)

ఓంశాంతి. ఇది భక్తిమార్గము వారి పాట. జ్ఞానమార్గంలో పాటలు మొదలైనవి పాడరు, తయారు చేయరు, వాటి అవసరం కూడా లేదు ఎందుకంటే తండ్రి ద్వారా క్షణంలో జీవన్ముక్తి వారసత్వంగా లభిస్తుందని మహిమ ఉంది. ఇందులో పాటల అవసరం లేదు. మనకు అనంతమైన తండ్రి ద్వారా అనంతమైన వారసత్వం లభిస్తుందని మీకు తెలుసు. భక్తిమార్గంలోని సంప్రదాయాలు, పద్ధతులు ఇందులో ఉండవు. పిల్లలు కవితలు మొదలైనవి ఇతరులకు వినిపించేందుకు తయారు చేస్తారు. అవి కూడా మీరు అర్థం చేయించినంత వరకు ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. ఇప్పుడు పిల్లలైన మీకు తండ్రి లభించారు కనుక మీ సంతోష పాదరస మట్టం పెరుగుతూ ఉండాలి. తండ్రి 84 జన్మల చక్ర జ్ఞానాన్ని కూడా వినిపించారు. ఇప్పుడు మనము స్వదర్శన చక్రధారులుగా అయ్యామని మీకు సంతోషముండాలి. తండ్రి ద్వారా విష్ణుపురికి అధికారులుగా అవుతున్నాము. నిశ్చయబుద్ధి గలవారికే విజయం లభిస్తుంది. ఎవరికి నిశ్చయం కలుగుతుందో వారు సత్యయుగంలోకి తప్పకుండా వస్తారు. కనుక పిల్లలు సదా చాలా సంతోషంగా ఉండాలి, తండ్రిని అనుసరించాలి. నిరాకార తండ్రి ఎప్పటి నుండి ఇతని దేహంలో ప్రవేశించారో అప్పటి నుండి ఇతని వద్ద కూడా చాలా పెద్ద గొడవలయ్యాయని పిల్లలకు తెలుసు. సోదరుల గొడవలు, పట్టణంలోని వారి గొడవలు, పూర్తి సింధ్‌లో అనేక గొడవలు జరిగాయి. పెద్దవారైన పిల్లలు త్వరగా మాకు వివాహం చేయమని అంటారు. వివాహం చేయకుంటే పనులెలా జరుగుతాయి? అని గొడవ చేశారు. గీతను చదవడం వదిలేవారు కాదు. గీతా భగవంతుడు శివుడు అని అర్థమైనప్పటి నుండి ఆ గీతను

చదవడం వదిలేశారు. నేను విశ్వాధికారిగా అవుతామనే నషా ఎక్కింది. ఇది శివ భగవానువాచ కనుక ఆ గీతను చదవడం వదిలేశారు. తర్వాత పవిత్రత పై చాలా హంగామా (గొడవ) జరిగింది. సోదరులు, చిన్నాన్నలు, మామలు మొదలైనవారు చాలామంది ఉండేవారు. ఇందులో ధైర్యముండాలి కదా. మీరు మహావీరులు, మహావీర వనితలు. మీకు ఒక్కరి గురించి తప్ప ఇంకెవ్వరి గురించి చింత లేదు. పురుషుడు రచయిత. రచయిత స్వయం పావనంగా అయితే రచనను కూడా పావనంగా తయారు చేస్తాడు. పవిత్ర హంసలు, అపవిత్ర కొంగలు కలిసి ఎలా ఉండగలరు. రచయిత నా మతానుసారము నడుచుకుంటే నడుచుకో లేకుంటే వెళ్లిపో అని తక్షణం ఆజ్ఞాపించగలడు. ఇతని(బ్రహ్మా బాబా) లౌకిక పుత్రిక వివాహితురాలైనప్పటికీ జ్ఞానము లభించగానే *'వాహ్ బాబా!'* అని పలికిందని మీకు తెలుసు. తండ్రి పవిత్రంగా అవ్వమని చెప్తున్నప్పుడు నేనెందుకు అవ్వను అని అనింది. నేను విషమివ్వనని వెంటనే పతికి జవాబిచ్చింది. అంతే, ఈ విషయం పై ఎన్నో గొడవలు జరిగాయి. పెద్ద పెద్ద ఇళ్ళ నుండి కూడా ఆడపిల్లలు వచ్చేశారు. ఎవ్వరినీ ఖాతరు చేయలేదు. అదృష్టంలో లేని వారు అర్థము కూడా చేసుకోలేదు. పవిత్రంగా ఉండాలంటే ఉండండి లేకుంటే మీ ఏర్పాట్లు మీరు చేసుకోండి అని చెప్పేందుకు అంత ధైర్యము కూడా ఉండాలి కదా. బాబా ముందు చాలా గొడవలు జరిగాయి. బాబా కోపగించుకోవడం ఎప్పుడైనా చూశారా? అమెరికా వరకు వార్తాపత్రికలలో ప్రచురింపబడింది. కొత్తదేమీ కాదు. కల్పక్రితం వలె జరుగుతుంది, ఇందులో భయపడేదేముంది? మనము మన తండ్రి నుండి వారసత్వం తీసుకోవాలి, మన రచనను కాపాడాలి. ఈ సమయంలో రచనంతా పతితంగా ఉందని తండ్రికి తెలుసు. నేనే అందరినీ పావనంగా తయారుచేయాలి. తండ్రినే అందరూ *ఓ పతితపావనా, ముక్తిదాత రండి* ! అని పిలుస్తారు. అందువలన వారికి జాలి కలుగుతుంది. వారు దయా హృదయులు కదా. కావున బాబా అర్థం చేయిస్తున్నారు - పిల్లలారా, ఏ విషయంలోనూ భయపడకండి. భయపడితే ఉన్నతమైన పదవిని పొందలేరు. అత్యాచారాలు మాతల పైనే జరుగుతాయి. ద్రౌపదిని అవమానపరచడం కూడా మీ స్మారక చిహ్నమే. తండ్రి 21 జన్మలకు అపవిత్రం అవ్వకుండా రక్షిస్తారు. ప్రపంచానికి ఈ విషయాలు తెలియదు. 'సద్గతిదాతను నేనే కదా'. మనుష్యులు దుర్గతిపాలు అవ్వనంత వరకు నేను వచ్చి సద్గతిని ఎలా ఇవ్వగలను? సృష్టి పతితంగా, తమోప్రధానంగా అవ్వనే అవ్వాలి. ప్రతి వస్తువు క్రొత్త నుండి పాతదిగా తప్పకుండా అవుతుంది. పాత ఇంటిని వదలనే వదలాలి. నూతన ప్రపంచం బంగారు యుగం, పాత ప్రపంచం ఇనుప యుగం. సదా నూతనంగా ఉండజాలదు. ఇది సృష్టి చక్రమని పిల్లలకు తెలుసు. దేవీ దేవతల రాజ్యము మళ్ళీ స్థాపనౌతూ ఉంది. తండ్రి చెప్తున్నారు - మీకు మళ్ళీ గీతా జ్ఞానాన్ని వినిపిస్తున్నాను. ఇక్కడ

రావణ రాజ్యంలో దు:ఖముంది. రామరాజ్యమని దేనినంటారో ఎవ్వరికీ తెలియదు, చెప్పినా అర్థము కూడా చేసుకోరు. తండ్రి చెప్తున్నారు - నేను స్వర్గము లేక రామ రాజ్యాన్ని స్థాపన చేసేందుకు వచ్చాను. పిల్లలైన మీరు అనేకసార్లు రాజ్యాన్ని తీసుకొని మళ్ళీ పోగొట్టుకున్నారు. ఇది అందరి బుద్ధిలో ఉంది. మీరు 21 జన్మలు సత్యయుగంలో ఉంటారు, దానికే 21 తరాలని చెప్తారు. తరం అనగా అంటే వృద్ధులైనప్పుడు శరీరాన్ని వదిలేస్తారు. అక్కడ అకాల మృత్యువు ఎప్పుడూ సంభవించదు. ఇప్పుడు మీరు త్రికాలదర్శుల వలె అయ్యారు. జన్మ-జన్మలుగా భక్తి చేశామని ఇప్పుడు మీకు తెలుసు. రావణ రాజ్యము ఎంత ఆడంబరంగా ఉందో చూడండి. ఇది అంతిమ సమయపు ఆడంబరం. రామరాజ్యం



సత్యయుగంలో ఉంటుంది - అక్కడ ఈ విమానాలు మొదలైనవన్నీ ఉండేవి తర్వాత అవన్నీ మాయమైపోయాయి. మళ్ళీ ఈ సమయంలో అన్నీ వెలువడ్డాయి. ఇప్పుడు ఇవన్నీ మళ్ళీ నేర్చుకుంటున్నారు. నేర్చుకునేవారు ఆ సంస్కారాన్ని అక్కడకు తీసుకెళ్తారు. తర్వాత అక్కడకు వచ్చి విమానాలను తయారుచేస్తారు. ఇవి మీకు భవిష్యత్తులో సుఖమిచ్చేవి. ఈ విమానాలు మొదలైన వాటిని భారతవాసులు కూడా తయారు చేయగలరు. కొత్త విషయమేమీ కాదు. బుద్ధివంతులే కదా. ఈ విజ్ఞానము మీకు అక్కడ పనికొస్తుంది. ఇప్పుడీ విజ్ఞానము ఇక్కడ దు:ఖమిస్తూ ఉంది తర్వాత ఇదే విజ్ఞానము అక్కడ సుఖాన్నిస్తుంది. అక్కడ ప్రతి వస్తువు నూతనంగా ఉంటుంది. ఇప్పుడు నూతన ప్రపంచం స్థాపనవుతూ ఉంది. తండ్రియే వచ్చి నూతన రాజధానిని స్థాపన చేస్తున్నారు కనుక పిల్లలు మహావీరులుగా అవ్వాలి. భగవంతుడు వచ్చి ఉన్నారని ప్రపంచంలోనివారెవ్వరికీతెలియదు.

తండ్రి చెప్తున్నారు - గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా పవిత్రంగా ఉండండి. ఇందులో భయపడవలసిన విషయమేదీ లేదు. నిందలు పడవలసి ఉంటుంది అంతే. ఇతను కూడా చాలా నిందల పాలయ్యాడు. కృష్ణుడు కూడా నిందలు పడ్డాడని చూపిస్తారు. కృష్ణుడు నిందలపాలవ్వడు. కలియుగంలో నిందలపాలౌతారు. మీకు ఇప్పుడున్న ఈ రూపము మళ్ళీ కల్పము తర్వాత ఈ సమయంలోనే ఉంటుంది, మధ్యలో ఉండదు. ప్రతి జన్మకు రూపురేఖలు మారిపోతాయి. ఒక ఆత్మకు 84 జన్మలలో ఒకే రకమైన రూపు రేఖలు లభించవు. సతో, రజో, తమోలలో వస్తూ ఉంటారు. రూపురేఖలు మారిపోతూ ఉంటాయి. ఇది తయారైన డ్రామా. కల్పక్రితం 84 జన్మలలో ఏ ముఖాలు తీసుకున్నారో, అవే తీసుకుంటారు. వీరి ముఖకవళికలు మారి వచ్చే జన్మలో లక్ష్మీనారాయణులుగా అవుతారని మీకు తెలుసు. మీ బుద్ధికి వేయబడిన తాళము ఇప్పుడు తెరుచుకుంది. ఇప్పుడిది కొత్త విషయం. బాబా కూడా కొత్తవారే, విషయాలు కూడా కొత్తవే. ఈ విషయాలు వెంటనే ఎవ్వరికీ అర్థం కావు. అదృష్టంలో ఉంటే కొద్దిగానైనా అర్థమౌతుంది. మహావీరులు ఏ తుఫానులకు భయపడరు. ఆ స్థితి చివర్లో వస్తుంది. అందుకే ఆతీంద్రియ సుఖము గురించి తెలుసుకోవాలంటే గోప-గోపికలను అడగండని అంటారు. పిల్లలను స్వర్గానికి అర్హులుగా చేసేందుకే తండ్రి వచ్చారు. కల్పక్రితం వలె నరకం వినాశనం అవ్వనే అవ్వాలి. సత్యయుగంలో ఒకే ధర్మముంటుంది. ఐకమత్యంగా ఉండాలని అందరూ కోరుకుంటారు. ఏకధర్మ స్థాపన జరగాలని కోరుకుంటారు. రామరాజ్యము, రావణరాజ్యము వేరువేరని కూడా ఎవ్వరికీ తెలియదు. ఇక్కడ వికారాలు లేకుండా జన్మ జరగదు. మలినమైన మనుష్యులు కదా. ఒకవేళ తండ్రిలో పూర్తి నిశ్చయముంటే శ్రీమతానుసారం తప్పకుండా నడవాల్సి వస్తుంది కదా. ప్రతి ఒక్కరి నాడి కూడా గమనించ బడ్తుంది. దాని అనుసారం సలహా కూడా ఇవ్వబడుతుంది. బాబా కూడా పిల్లలకు చెప్పేవారు - వివాహం చేసుకోవాలనుకుంటే వెళ్ళి చేసుకోండి. చాలామంది బంధు-మిత్రులు మొదలైనవారు ఉన్నారు, వారు వివాహం చేయించేస్తారు. ప్రతి ఒక్కరి నాడి గమనించబడ్తుంది. బాబా, ఈ పరిస్థితులలో మేము పవిత్రంగా ఉండాలని అనుకుంటున్నాము, మా బంధువులు మమ్ములను ఇంటి నుండి వెలివేస్తున్నారు, ఇప్పుడు మేము ఏం చేయాలి? అని అడుగుతారు. అందుకు బాబా - పవిత్రంగా ఉండాలా అని నన్ను అడుగుతున్నారా? ఉండలేకపోతే వెళ్ళి వివాహం చేసుకోండి అని అంటారు. ఎవరికైనా వివాహమయిందనుకోండి రాజీ చేసుకోవాలి, తప్పేమీ లేదు. మంగళ సూత్రం (కంకణం) కట్టేటప్పుడు కూడా - వీరు మీ పతి, గురువు అని చెప్తారు కదా. ఆ సమయం లో మీరు ఆమెతో ఈ విషయాలన్నీ వ్రాయిస్తూ పోండి. నేను నీ గురువు, ఈశ్వరుడను అని ఒప్పుకున్నావు కదా, వ్రాస్తున్నావు కదా, సరే, నేనిప్పుడు నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను -

పవిత్రంగా ఉండాలి. ఇలా అనేందుకు ధైర్యము కావాలి కదా. లక్ష్యము చాలా ఉన్నతమైనది. ఇద్దరూ కలిసి పవిత్రంగా ఎలా ఉండగలరో అందరికీ చూపించాలి. ఇందులో ప్రాప్తి చాలా గొప్పది. ప్రాప్తిని గురించి తెలియనప్పుడే వికారాల అగ్ని రగులుకుంటుంది. తండ్రి చెప్తున్నారు - ఇంత గొప్ప ప్రాప్తి కలుగుతున్నప్పుడు ఒక్క జన్మ పవిత్రంగా ఉండడం పెద్ద విషయమా? నేను మీ పతిని, ఈశ్వరుడను. నా ఆజ్ఞ పై పవిత్రంగా తప్పకుండా ఉండాలి అని చెప్పాలి. తండ్రి యుక్తులు తెలియజేస్తారు. భారతదేశంలో ఈ నియమముంది - నీ పతియే నీ ఈశ్వరుడని, అతని ఆజ్ఞ పై నడవాలని స్త్రీకి చెప్తారు. పతి పాదాలు ఒత్తాలి ఎందుకంటే లక్ష్మినారాయణుని పాదాలు ఒత్తిందని భావిస్తారు. ఈ అలవాటు ఎలా మొదలయింది? ఈ అసత్యమైన చిత్రాల నుండి మొదలయ్యింది. సత్యయుగంలో ఇటువంటి విషయాలు ఉండవు. లక్ష్మి వచ్చి పాదాలు ఒత్తేందుకు నారాయణుడు ఎప్పుడైనా అలసిపోతాడా? అక్కడ అలసట కలిగే మాటే ఉండదు. అలసిపోవడం దు:ఖమిచ్చే విషయం కదా. అక్కడ దు:ఖము ఎక్కడ నుంచి వస్తుంది. కావున ఎన్నో అసత్యమైన విషయాలు వ్రాసేశారు. బాబాకుచిన్నప్పటి నుండి వైరాగ్యముండేది కనుకనే భక్తి చేసేవారు.



తండ్రి పిల్లలకు చాలా మంచి యుక్తులు తెలియజేస్తారు. కొంతమంది మగ పిల్లలను వారి బంధువులు వివాహం చేసుకోమని చాలా సతాయిస్తారు. అటువంటప్పుడు వివాహం చేసుకోండి, స్త్రీ మీదైపోతుంది. తర్వాత ఎవ్వరూ ఏమీ చేయలేరు. పరస్పరంలో కలిసి ఉండి పవిత్రంగా ఉండండి, స్నేహితులైపోతారు. విదేశాలలో వృద్ధులైనప్పుడు తమను సంభాళన చేసేందుకు పవిత్ర వివాహం చేసుకుంటారు, వికారాలలోకి వెళ్లరు. మనము ఒక్క తండ్రి పిల్లలమని, పరస్పరం సోదరి-సోదరులుగా అయ్యామని మీకు తెలుసు. తాత

నుండి వారసత్వం తీసుకుంటాము. తండ్రిని పతిత ప్రపంచంలోనే పిలుస్తారు. *ఓ పతితపావనా, సీతలందరి రామా!* అని పిలుస్తారు. మనుష్యులు రామా - రామా అని జపించినప్పుడు సీతను గుర్తు చేసుకోరు. ఆమె కంటే లక్ష్మి పెద్దది. కానీ ఒక్క తండ్రిని మాత్రమే స్మృతి చేస్తారు. లక్ష్మీనారాయణుల గురించి తెలుసు కానీ శివుని గురించి ఎవ్వరికీ తెలియదు. ఆత్మ బిందువైతే ఆత్మల తండ్రి కూడా బిందువే కదా. ఆత్మలో పూర్తి జ్ఞానమంతా ఉంది. వారిని జ్ఞానసాగరులని అంటారు. ఆత్మలైన మీరు కూడా జ్ఞానసాగరులుగా అవుతారు. జ్ఞానసాగరులు కూర్చొని ఆత్మలైన మీకు అర్థం చేయిస్తున్నారు. ఆత్మ చైతన్యమైనది. మీ ఆత్మ జ్ఞానసాగరంగా అవుతూ ఉంది. పూర్తి సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానము మీలో ఉంది. మధురమైన పిల్లలు ధైర్యము చేయాలి. మనము బాబా శ్రీమతమును అనుసరించాలి కదా. అనంతమైన తండ్రి అనంతమైన పిల్లలను స్వర్గానికి అధికారులుగా చేస్తున్నారు కనుక మీరు కూడా మీ రచనను మీ అదుపులో ఉంచుకోవాలి. ఒకవేళ పిల్లలు మీ ఆజ్ఞను పాటించకుంటే వారు పిల్లలే కారు. వారు కుపుత్రులౌతారు. ఆజ్ఞాకారీ పిల్లలే వారసత్వానికి హక్కుదారులుగా అవుతారు. అనంతమైన తండ్రి కూడా చెప్తున్నారు - నా శ్రీమతాన్ని అనుసరిస్తే, మీరు ఇటువంటి శ్రేష్ఠులుగా అవుతారు లేకుంటే ప్రజలలోకి వెళ్ళిపోతారు. తండ్రి మిమ్మల్ని నరుని నుండి నారాయణునిగా చేసేందుకే వచ్చారు. ఇది సత్యమైన సత్యనారాయణ కథ. మీరు రాజ్యము ప్రాప్తి చేసుకునేందుకు వచ్చారు. ఇప్పుడు మమ్మా, బాబా రాజా-రాణులుగా అవుతారు కనుక మీరు కూడా ధైర్యము చేయండి. తండ్రి తమ సమానంగా తప్పకుండా తయారు చేస్తారు. ప్రజలుగా అవుతే చాలు అని అనుకోరాదు. పురుషార్థం చేయాలి - మనము తండ్రి నుండి పూర్తి వారసత్వం తీసుకుంటాము, బలి అవుతాము. బాబాను మీరు వారసునిగా చేసుకుంటే, వారు మీకు 21 జన్మలకు వారసత్వమునిస్తారు. తండ్రి పిల్లల పై బలి అవుతారు. పిల్లలంటారు - బాబా ఈ తనువు, మనసు, ధనము అంతా మీదే. మీరు మా తండ్రే కాక, బిడ్డ కూడా అయ్యారు. త్వమేవ మాతాశ్చ పితా త్వమేవ.... ఈ తండ్రి మహిమ ఎంత గొప్పది! ప్రపంచంలో ఈ విషయాలు ఎవ్వరికీ తెలియదు. ఈ విషయాలన్నీ భారతదేశం గురించినవే. ఇది అదే 5 వేల సంవత్సరాల క్రితం నాటి యుద్ధమని పిల్లలైన మీకు తెలుసు. ఇప్పుడు స్వర్గ స్థాపన జరుగుతూ ఉంది కావునపిల్లలు సదా చాలా సంతోషంగా ఉండాలి. భగవంతుడు మిమ్ములను దత్తు తీసుకున్నారు కనుక మీరు చాలా సంతోషంగా ఉండాలి. తండ్రి పిల్లలైన మీకు అలంకారం కూడా చేస్తున్నారు. అనంతమైన తండ్రి జ్ఞానసాగరులు మిమ్ములను చదివిస్తున్నారు కూడా. మనకు పూర్తి సృష్టి ఆదిమధ్యాంతాల రహస్యాలను అర్థం చేయిస్తారు. ఎవరికి తండ్రి గురించే తెలియదో వారు నాస్తికులు. మీరు తండ్రిని, వారి రచనను గురించి తెలుసుకున్నారు. కనుక మీరు

ఆస్తికులు. లక్ష్మీనారాయణులు ఆస్తికులా లేక నాస్తికులా? మీరేమంటారు? సత్యయుగంలో పరమాత్మని ఎవ్వరూ స్మృతి చేయరని మీరే చెప్తారు కదా. అక్కడ సుఖముంటుంది. కావున సుఖంలో పరమాత్మని స్మరణ చేయరు. ఎందుకంటే పరమాత్మని గురించే తెలియదు. ఈ సమయంలో మీరు ఆస్తికులుగా అయి వారసత్వాన్ని పొందుకుంటున్నారు తర్వాత అక్కడ స్మృతే చేయరు. ఇక్కడ స్మృతి చేస్తారు కానీ వారి గురించి తెలియదు. కనుక నాస్తికులని అంటారు. అక్కడ తండ్రి ఎవరో తెలియదు కనుక స్మృతి కూడా చెయ్యరు. ఈ వారసత్వం మాకు శివబాబా ద్వారా లభించిందని వారికి తెలియను కూడా తెలియదు కానీ వారు పావనులు కనుక వారిని నాస్తికులని అనరు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. శ్రీమతాన్ని పూర్తిగా పాటించే ధైర్యము చేయాలి. ఏ విషయంలోనూ భయపడరాదు లేక కోపగించుకోరాదు, చింతించరాదు.

2. తమ రచనను తమ అదుపులో పెట్టుకోవాలి. వారిని వికారాల నుండి రక్షించాలి. పావనంగా ఉండాలని సలహానివ్వాలి.

వరదానము :- " శరీరాన్ని ఈశ్వరీయ సేవ కొరకు అమానత్(తాకట్టు)గా భావించి కార్యంలో ఉపయోగించే నిర్మోహి భవ "

ఎలాగైతే ఏదైనా తాకట్టు ఉంచిన వస్తువులో అపనాపన్(ఇది నాది అనే భావన) ఉండదో, మమత కూడా ఉండదో, అలా ఈ శరీరం కూడా ఈశ్వరీయ సేవ కొరకు ఒక తాకట్టు(అమానత్). దీనిని ఆత్మిక తండ్రి ఇచ్చారు అని భావిస్తే ఆత్మిక తండ్రి యొక్క స్మృతి తప్పకుండా ఉంటుంది. తాకట్టుగా భావిస్తే ఆత్మీయత వస్తుంది. 'నాది' లోని మమత ఉండదు. నిరంతర యోగులుగా, నిర్మోహులుగా అయ్యేందుకు ఇదే సహజమైన ఉపాయం. కనుక ఇప్పుడు ఆత్మిక స్థితిని ప్రత్యక్షం చేయండి.

స్లోగన్ :- " వానప్రస్థ స్థితిలోకి వెళ్ళాలంటే దృష్టి - వృత్తిలో పవిత్రతకు ప్రాముఖ్యత ఇవ్వండి (అండర్‌లైన్ చేయండి). "

-: ఓంశాంతి :-